
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

పల్నాడు జిల్లా వార్తలు

మంగళవారం 1 జూలై 2025

రోగుల కృతజ్ఞతే సంతృప్తి

- ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం డాక్టర్
- రోగికి, వైద్యులకు ప్రత్యేకమైన అనుబంధం
- వైద్య వృత్తిపై మక్కువతో వైద్యుల సేవలు..

నేడు వరల్డ్ డాక్టర్స్ డే..

8





బియ్యంలో పురుగులు పాకుతున్నా ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)

పురుగుల బియ్యం.. ప్రభుత్వం సీరియస్

- ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్
- గోదాము మేనేజర్‌పైనా చర్యలకు ఆదేశం
- కొనుగోళ్లలో అవకతవకలే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- సమగ్ర విచారణకు ప్రత్యేక బృందం

తెనాలి, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఉండటంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాములో పనిచేసే టెక్నికల్ సిబ్బంది, ఇతర అధికారులు కలిపి మొత్తం ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేసింది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. గోదాము మేనేజర్‌పై చర్యలకు ఆదేశించడంతో పాటు, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని చిన్నారులకు నాణ్యమైన సన్న బియ్యం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బియ్యంలో పురుగులు ఉండటం, అవి తిరుగాడుతుండగానే ప్యాకింగ్ చేసేస్తుండటంపై ఈ నెల 24న ఆంధ్రజోతి దినపత్రికలో సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. ముక్కు పురుగులు సంచుల నిండా ఉన్నా.. వాటిని అలానే.. పాఠశాలలకు పంపేందుకు ప్యాకింగ్ చేసి, సిద్ధం చేశారు. దీనిపై సమాచారం అందడంతో ఆంధ్రజ్యోతి పరిశీలించింది. పురుగులు ప్రత్యక్షంగా కనిపించడం, నాణ్యమైన బియ్యం స్థానంలో నాసిరకం బియ్యం కొనుగోలు చేయడం.. ఇందులో భారీ మొత్తంలో మామూళ్ల రూపంలో డబ్బు చేతులు మారడం తదితరాలు వెలుగులోకి రావడంతో.. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను తక్షణ పరిశీలనకు మంత్రి మనోహర్ ఆదేశాలిచ్చారు. ఉన్నతాధికారులు తెనాలి గోదాములో బియ్యం నిల్వలను పరిశీలించారు. వారికి కూడా పురుగుల మయమైన బియ్యం కనిపించడంతో.. నాశిరకం బియ్యం కొనుగోళ్ల కారణంగానే ఈ లోపం జరిగినట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బియ్యం కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఎస్.డబ్ల్యుసి గోదాముల టెక్నికల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు.దీనిపై సమగ్ర విచారణ కోసం విజయవాడ నుంచి ఒక ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు తెలిసింది. వారు దీనిపై విచారణ జరిపి, లోపం ఎక్కడ జరిగింది? అవకతవకలకు పాల్పడిన సిబ్బంది ఎవరనేది తేల్చాల్సి ఉంది. ఇప్పటికే విచారణ కూడా మొదలు పెట్టినట్టు సమాచారం. త్వరలో పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. ఆ తర్వాతే చేతివాటం చూపిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



సన్నగిల్లుతున్న లక్ష్యం శీర్షికన పురుగుల బియ్యంపై ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



ఆగంతకులకు రాచమార్గం

- ఈఎఫ్‌టీలోనే అసలు తంటా
- రెల్వే ప్రయాణికుల భద్రత గాలిలో దీపం
- రైళ్లలో దోపిడీలకు టీటీఈలే పరోక్ష కారణం ?

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలోని రిజర్వేషన్ బోగీల్లో భద్రత గాలిలో దీపంలా మారింది. వరుస చోరీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. దీనంతటికీ పరోక్ష కారణం.. టీటీఈల చేతివాటమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్లీపర్, ఏసీ త్రీటైర్ బోగీల్లో ఆగంతకులు దర్జాగా ప్రయాణిస్తున్నారు. ఈ విధానానికి అడ్డుకట్ట వేయాల్సిన రైల్వే శాఖ.. అందుకు విరుద్ధంగా ఆదాయమే పరమావధిగా వ్యవహరిస్తోంది. రిజర్వేషన్ లేని వాళ్లకు ఫైన్లు వేసి మీ ఇష్టం వచ్చిన చోట కూర్చోమని ఈఎఫ్‌టీ(ఎక్సెస్ ఫేర్ టిక్కెట్) రాసి టీటీఈ చేతిలో పెడుతున్నారు. దీనిని అవకాశంగా చేసుకొంటున్న దోపిడీ దొంగలు అర్ధరాత్రి ప్రయాణికులందరూ నిద్రలోకి జారుకున్నాక తమ ప్రతాపం (మిగతా 8వ పేజీలో)

కేంద్ర పథకాలను గడువులోగా పూర్తి చేయాలి

నరసరావుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను నిర్దీత గడువులోపు పూర్తి చేయాలని కేంద్ర జల శక్తి శాఖ అధికారులు కిరణ్ కుమార్ కర్లపు, రేష్మ పిళ్ళై సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కేంద్ర పథకాల పురోగతిపై వారు సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్, నీటి లభ్యత స్థాయిలు, అమృత్ 2.0, చిన్న నీటి పారుదల పథకాలు, జిల్లా నీటి యాజ మాన్య సంస్థ ద్వారా చేపడుతున్న పథకాలను సమీక్షించారు. జిల్లాలో పనుల ప్రగ తి బాగున్నప్పటికీ.. సంబంధిత వెబ్ సైట్లలో ఫొటోలు అప్‌లోడ్ చేయక పోవడం వల్ల పనుల పురోగతి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని కేంద్రం నుంచి వచ్చిన అధి కారులు తెలిపారు. పనుల తాలూకు ఫోటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కిరణ్ కుమార్ కర్లపు, రేష్మ పిళ్లైలతో కూడిన అధికారుల బృందం జిల్లాలో పర్యటించి వివిధ పథ కాల అమలు తీరు, పురోగతిని పరిశీలించింది.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర జల శక్తి శాఖ అధికారులు



- రిజర్వాయర్‌కు ఒక వైపున పూర్తైన ఫస్ట్ లేయర్ ఫౌండేషన్

వరద నీటి నిర్వహణ

పర్యాటక ఆకర్షణ

- పూర్తయిన పూడిక తీత
- తుది దశకు ఫస్ట్ లెవెల్ ఫౌండేషన్
- వర్షాలకు నీరు చేరకుండా జాగ్రత్తలు
- చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

వేగంగా సెంట్రల్ పార్కు రిజర్వాయర్ పనులు

రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన వరద నీటి నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శాఖమూరులో నిర్మిస్తున్న సెంట్రల్ పార్కులోని 50 ఎకరాల కొండవీటి వాగు రిజర్వాయర్ పూర్తికావొస్తోంది. వర్షాలు పడుతున్నప్పటికీ పనులు ఆగకుండా ఎప్పటి కప్పుడు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. కేవలం రిజర్వాయ ర్‌గానే కాకుండా.. ఒక పర్యాటక ప్రాంతంగా దీనిని తీర్చిదిద్దేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లను సీఆర్డీఏ చేస్తోంది.

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని శాఖమూరు గ్రామంలో నిర్మిస్తున్న 300 ఎకరాల సెంట్రల్ పార్కులో కొండవీటి వాగు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, సీఆర్డీఏ నిర్ణయించింది. కొండవీటి వాగు వరద నీటి నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ రిజర్వాయర్‌ను సెంట్రల్ పార్కులో ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటక ఆకర్షణగా ఉంటుందని భావించిన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. కొండవీటి వాగుకు వరద నీరు వచ్చినప్పుడు ఈ రిజర్వాయర్‌ను నింపు తారు. అది కూడా నిండిపోయాక అదనపు ప్రవాహాన్ని నీరుకొండ రిజర్వాయర్‌కు తరలిస్తారు. అక్కడ కూడా నిండి పోయాక కృష్ణాయపాలెం- కురగల్లు మధ్య నిర్మించే మరో రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. అవి కూడా నిండి పోయాక అదనపు నీటిని కృష్ణా నది వైపు నకు వదిలేస్తారు. కృష్ణా నదిలో కూడా వరద ప్రభావం ఎక్కువగా ఉంటే ప్రకాశం బ్యారేజీ వద్ద నిర్మించిన ఎత్తిపోతల యంత్రాల ద్వారా కృష్ణా నదిలోకి తోడి పోస్తారు. ఇలా రాజధాని వరద నీటి (మిగతా 8వ పేజీలో)



రిజర్వాయర్‌లో జరుగుతున్న తొలి దశ ఫౌండేషన్ పనులు

72 మందికి ఉద్యోగాలు

- నియామక పత్రాలు అందజేసిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాబి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మోడరన్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 185 మంది యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో 72 మందిని ఉద్యోగాలకు ఏంపిక చేశారు. ఎంపికైన వారికి ముఖ్య అతిథి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లంపై పట్టు సాధించాలని సూచించారు. చదువుతో పాటు అదనపు అర్హతలు ఉంటేనే అన్ని రంగాల్లో రాణించే వీలుందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ చేబ్రోలు మహేష్, నైపుణ్యాభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇ.తమ్మాజీరావు, సంస్థ జిల్లా ప్లేస్ మెంట్ అధికారి ఎం.రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

గ్రేడ్ -5 కార్యదర్శులకు **కౌన్సెలింగ్**

ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు ఆమోదం


కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

6

కంటపడితే కబ్జా..!

- వినుకొండలో భూముల ధరలకు రెక్కలు
- ప్రభుత్వ భూముల రికార్డులు తారుమారు
- రెవెన్యూ, అధికార పార్టీ నేతలకు భారీగా ముడుపులు
- గత వైసీపీ పాలన నుంచి కొనసాగుతున్న ఆక్రమణలు

వినుకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంతో పాటు మండలంలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. భూముల ధరలు పెరగడంతో వారి కన్ను ప్రభుత్వ భూములపై పడింది. వినుకొండ పట్టణం చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో ఎటు చూసినా ప్రధాన రహదారుల పక్కన ఎకరం రూ.కోటి నుంచి రూ.5 కోట్ల వరకు పలుకుతోంది. దీనితో భూ కబ్జాదారులు, రియల్టర్లు.. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి విలువ గలిగిన ప్రభుత్వ భూముల వివరాలు సేకరించి, అక్కడ పాగా వేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు, అధికార పార్టీ నాయకులకు భారీ మొత్తంలో ముట్టజెప్పి రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తున్నారు. వారసత్వ హక్కుల పేరుతో ట్యాంపరింగ్ చేసి, అక్రమరిజిస్ట్రేషన్‌లతో రూ.కోట్లు దోచుకుంటున్నారు. గత వైసీపీ ప్రభు త్వంలో వినుకొండ చుట్టూ వందల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరధిలోని జాలలపాలెం గ్రామం వద్ద 175 ఎకరాలు స్వాహా చేశారని ఆరోపణలొచ్చాయి. దీతో హైకోర్టులో కేసులు వేయడం.. విచారణలో అందులో ప్రభుత్వ భూమి ఉందని నిర్ధారించడం జరిగింది.



పసుపులేరు బ్రిడ్జి వద్ద ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి

రూ.10 కోట్లు విలువైన ప్రభుత్వ భూమి..

వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డులో కోల్డ్ స్టోరేజీ వద్ద సుమారు రూ.10 కోట్లు విలువ చేసే ప్రభుత్వ అసైన్డ్, వాగు పోరంబోకు భూమిని కబ్జా చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ, టీడీపీ నాయకులిద్దరూ కలిసి రెవెన్యూ అధికారులకు భారీగా తాయిలాలు ఇచ్చి.. భూ రికార్డులు తారుమారు చేసి ఆక్రమించారు. ఇందుకు విశ్రాంత సైనికుల పేర్లతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, భారీ అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. తిమ్మాయపాలెం రెవెన్యూ పరిధిలోని వాగు పోరంబోకుతో పాటు, ప్రభుత్వ భూమిని కోల్డ్ స్టోరేజీ రోడ్డు మలుపు వరకు ఆక్రమించారు. నకిలీ డాక్యుమెంట్లతో రికార్డులు మార్చి ప్రస్తుతం రెవెన్యూ అడంగల్‌లో కొనుగోలు నమోదు చేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి అనుభవిస్తున్నారు.



డాలర్ సిటీ వద్ద ఆక్రమణలో ఉన్న కుంట పోరంబోకు ప్రభుత్వ భూమి

బొగ్గుల బట్టి వద్ద 6 ఎకరాలు స్వాహా

వినుకొండ.. తిమ్మాయపాలెం రోడ్డు నుంచి కోల్డ్ స్టోరేజీ మీదుగా మార్కాపుం హైవేకు వెళ్లేదారిలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారు. బొగ్గుల బట్టి సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ భూములు, రెవెన్యూ అసైన్డ్ భూములు ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించుకొని ప్రస్తుతం యథేచ్ఛగా వెంచర్‌లో కలుపుకొని విక్రయిస్తున్నారు. వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డు కొండ సమీపంలో సర్వే నంబరు 212లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది. అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలని రెండు రోజులుగా ఆందోళనకారులు వినుకొండ పట్టణంలో దీక్షలు చేపట్టారు. భూముల అన్యాక్రాంతంపై.. తహసీల్దార్ సురేష్ నాయక్‌ను వివరణ అడగ్గా భూముల వివరాలు తీసుకొని పరిశీలిస్తానని తెలిపారు.

రూ.20 కోట్లు విలువైన కుంట భూమి స్వాహా

తిమ్మాయపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 721లో 3.14 ఎకరాల కుంట పోరంబోకు భూమి కర్నూలు - గుంటూరు జాతీయ రహదారికి ఆనుకొని.. వినుకొండ పట్టణానికి కూత వేటు దూరలో ఉంది. పసుపులేరు బ్రిడ్జి వద్ద కమ్మ హాస్టల్ సమీపంలో ఉన్న ఈ భూమి ఎకరం రూ.5 కోట్ల పైనే పలుకుతోంది. ఇక్కడ సర్వే నంబరు 741/13లో 37.74 ఎకరాల చుక్కల భూములు, 720/14లో 7.70 ఎకరాల ప్రభుత్వ భూమి, 717/5లో 1.78 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. 2022లో టి.సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఆయా సర్వే నంబర్లలో 18.44 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి ఆక్రమించారని ఆరోపణలొచ్చాయి. రెవెన్యూ ఉన్న తాధికారుల ఫిర్యాదుతో లోకాయుక్తలో కేసు వేయడం జరిగింది. అప్పటి కలెక్టర్ శివ శంకర్ ఆ ప్రాంతంలో ప్రభుత్వ చుక్కల భూ ములు 47 ఎకరాలు ఉన్నట్లు నిగ్గుతేల్చి.. లోకాయుక్తకు నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జోక్యంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీకి చెందిన రియల్టర్లు, ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారులతో కుమ్మక్కయ్యారు. సర్వే నంబరు 721లో 3.14 ఎకరాల కుంట భూమికి డీకే పట్టాగా రికార్డులు తారుమారు చేయించి.. అక్రమాలకు పాల్పడ్డారు.

జీడీసీసీ బ్యాంకు సీఈఓగా **అజయ్ కిషోర్**

రైల్వే సవరించిన టిక్కెట్ చార్జీలు నేటి నుంచి అమలు

6

అమ్మ చనిపోదాం అంటోంది.. అందుకే వచ్చా..!

- కలెక్టర్‌నే కదిలించిన పదేళ్ల బాలుడు..!
- జీజీహెచ్ వద్ద టిఫిన్ బండి ఏర్పాటుకు విజ్ఞప్తి

మెయిన్‌లో..

ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు ఆమోదం

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

మంగళగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎగ్జిట్ ర్యాంపునకు కేంద్రం ఆమోదం తెలిపిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మంగళగిరి 16వ నంబరు జాతీయ రహదారి వద్ద ఎంట్రీ ర్యాంపును ఎగ్జిట్ ర్యాంపుగా మార్చేందుకు ఆమోదం లభించిందని చెప్పారు. దీని ద్వారా ఎయిమ్స్‌ను చేరుకునేందుకు ఇప్పటి వరకు ఉన్న దూరం 4.66 కిలోమీటర్ల నుంచి 1.26 కిలోమీటర్లకు తగ్గనుందని వెల్లడించారు. జాతీయ రహదారిపై మూడు కీలక ప్రాంతాల్లో 13 బోర్డుల ఏర్పాటుకు కూడా అనుమతి వచ్చిందన్నారు. అత్యవసర వైద్యం, రోగులు, ప్రయాణికుల రవాణా, వైద్య సిబ్బంది రాకపోకలకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.

గ్రేడ్ -5 కార్యదర్శులకు కౌన్సెలింగ్



గ్రేడ్ -5 కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓలు నాగసాయి కుమార్, ప్రభాకర్‌రావు, నాగేశ్వర్ నాయక్

గుంటూరు సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల కు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు 154 మంది ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్ తెలిపారు. మరో 62 మంది రిక్వస్ట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికీ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. బాపట్ల, పల్నాడు డీపీఓ లు కె.ఎల్.ప్రభాకర్ రావు, నాగేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ వెలవెల

● తగ్గిన ప్రయాణికుల రద్దీ ● పడిపోయిన రోజు వారీ చార్జీల ఆదాయం



ప్రయాణికుల్లేక కళావిహీనంగా ఉన్న ఎన్టీఆర్ బస్టాండ్

గుంటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి రోజువారీ ప్రయాణికుల రద్దీ క్రమంగా తగ్గుతోంది. నిత్యం కోలాహలంగా ఉండే ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల్లేక వెలవెలబోతోంది. శుభ కార్యాలు పెద్దగా లేకపోవడం.. మరో వైపు విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా తగ్గాయి. సాధారణంగా గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి బస్సులు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. తద్వారా ప్రయాణికులతో ఎన్టీఆర్ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రం గుంటూరు నుంచి రోజువారీగా వేలాది మంది గమ్య స్థానాలకు చేరుతుంటారు. కొన్ని రోజులుగా రోజువారీ ప్రయాణికుల సంఖ్య చాలా వరకు తగ్గుతూ వస్తోంది. కేవలం టిక్కెట్ల చార్జీల రూపంలోనే రెండు డిపోలకు దాదాపుగా నిత్యం రూ.38లక్షల నుంచి రూ.40 ల వరకు సమకూరుతుందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే తాజాగా ప్రయాణికుల రద్దీ తగ్గటంతో చార్జీల రూపంలో వచ్చే ఆదాయం కూడా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు తగ్గిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు పండుగులు, శుభకార్యాలు కూడా పెద్దగా లేకపోవడం, విద్యా సంస్థలు ప్రారంభమవడం కూడా ఒక కారణంగా విశ్లేషిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో బస్టాండ్‌లో వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. రానున్నది శ్రావణ మాసంతో పాటు శుభకార్యాలు కూడా పెద్ద ఎత్తున జరుగనున్న నేపథ్యంలో మున్ముందు ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మైనింగ్‌లో పన్ను ఎగవేతను అరికట్టాలి : జేసీ



సమావేశంలో జేసీ సూరజ్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

నరసరావుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ అక్రమ రవాణా ద్వారా జరిగే పన్ను ఎగవేతను అరికట్టాలని జేసీ సూరజ్ ధనుంజయ్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జీఎస్టీ సమావేశంలో తీర్మానించారు. శాఖల మధ్య సమన్వయ బలోపేతం, పన్ను పరిపాలన మెరుగు, వసూళ్ల లక్ష్యాల మేర సమర్థంగా చేయాలని జేసీ స్పష్టం చేశారు. జీఎస్టీ నమోదు చేయని వ్యాపారాలను గుర్తించి పన్ను పరిధిని విస్తరించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో అధికారులు వారి శాఖల్లో టీడీఎస్ నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలి సూచించారు. టీడీఎస్ చెల్లించని కాంట్రాక్టర్లను తదుపరి టెండర్లలో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో గుంటూరు 2 జాయింట్ కమిషనర్ బి.గీతామాధురి, డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

కోనో కార్పస్‌ను కాపాడుకుందాం

● పర్యావరణ వేత్త ప్రొఫెసర్ బయ్యపు రెడ్డి



మాట్లాడుతున్న పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపు రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కోనోకార్పస్ (దుబాయ్) మొక్కలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ఈ చెట్టు అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తుందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి పేర్కొన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో కోనో కార్పస్ మొక్కలను రక్షించుకుందాం అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రపంచంలో 80 దేశాలకు పైగా విస్తరించిన కోనోకార్పస్ కార్బన్ డైయాక్సైడ్‌ను తీసుకుని అత్యధికంగా ఆక్సిజన్ అందిస్తూ వాయు కాలుష్యాన్ని, ధ్వని కాలుష్యాన్ని నివారించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ మొక్క ఎలాంటి నిర్వహణ వ్యయం లేకుండా వేగంగా పెరుగుతూ పచ్చదనాన్ని అందిస్తూ, పర్యావరణ హితంగా కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. కోనోకార్పస్ పుప్పొడి ద్వారా అలర్జీ సమస్యలు వస్తాయనే ప్రచారం అపోహలు తప్ప ఎక్కడ ఆధారాలు లేవన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. మాఫియా తమ దోపిడీకి అడ్డంగా ఉన్నాయని కోనో కార్పొస్‌పై అర్థ రహిత ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఏళ్ళ రత్తయ్య, జీవశాస్త్ర నిపుణులు జి.గోపాలకృష్ణ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, టి.ధనుంజయ రెడ్డి, కొరివి వినయ్ కుమార్, ఓరుగంటి నారాయణ రెడ్డి, అవధానుల హరి, అల్లాబక్షు, మానవత నేతలు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కోసం గత 35 ఏళ్లుగా తనతో పాటు కలసి తిరిగి.. పార్టీ అధికారంలోకి రావడానికి పని చేసిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం రామాపురం గ్రామానికి చెందిన ఆకూరి వెంకటరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. కర్మక్రియల రోజున మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సిమెంట్ యాజమాన్యం ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతుడు ఆకూరి వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ మృతుడు ఆకూరి వెంకటరెడ్డి క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని పేర్కొన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు, వేముల వినోద్‌రెడ్డి, బద్రి, తంగెళ్ళ శ్రీను, పగడాల భాస్కరరావు, నెల్లూరి రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రైల్వే సవరించిన టిక్కెట్ చార్జీలు నేటి నుంచి అమలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సబర్బన్, నాన్ సబర్బన్ రైళ్లలో మంగళవారం నుంచి రైల్వేబోర్డు సవరించిన టిక్కెట్ చార్జీలు అమలులోకి రానున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే అమలులోకి వచ్చాయి. సబర్బన్(సింగిల్ జర్నీ ఫేర్)లో ఎలాంటి మార్పు చేయలేదు. సీజన్ టిక్కెట్స్(సబర్బన్, నాన్ సబర్బన్) రైళ్లలోనూ ఎలాంటి పెంపుదల చేయలేదు. ఆర్డినరీ నాన్-ఏసీ(నాన్-సబర్బన్) రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ టిక్కెట్ చార్జీలలో 500 కిలోమీటర్ల వరకు ఎలాంటి పెంపుదల లేదు.

501 నుంచి 1,500 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి రూ.5, 2,500 కిలోమీటర్ వరకు రూ.10, 3 వేల కిలోమీటర్ దూరం అయితే రూ. 15 చార్జీ పెరిగింది. స్లీపర్ క్లాస్ ఆర్డినరీలో కిలోమీటర్‌కు అర పైసా, ఫస్టు క్లాస్ ఆర్డినరీలోనూ అర పైసా పెంపుదల చేసింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్(నాన్-ఏసీ) సెకండ్ క్లాస్, స్లీపర్, ఫస్టు క్లాస్‌లో కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెంచింది. ఏసీ తరగతుల్లో ఏసీ చైర్‌కార్, ఏసీ 3 టైర్/3ఎకానమి, ఏసీ టూటైర్, ఏసీ ఫస్టుక్లాస్/ఎగ్జిక్యూటివ్ క్లాస్/ఈఏకు రూ.2 పైసలు చొప్పున పెంచింది.

గుంటూరు - విజయవాడ - తెనాలి, తెనాలి - రేపల్లె మధ్యన రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైళ్ల టిక్కెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్‌కు కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెంచడం వల్ల సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లలో చార్జీ రూ. 5 వరకు పెరగొచ్చు. అదే ఏసీ తరగతులు అయితే రూ.10 వరకు పెరిగే అవకాశం ఉంది. చెన్నై, తిరుపతి, విశాఖపట్టణం వెళ్లే రైళ్లకు కూడా ఇంతే మొత్తంలో పెరగొచ్చు. తిరువనంతపురం, హౌరా, భువనేశ్వర్, ఎల్‌టీటీ, నాగర్‌సోల్, పూణే, పూరీ, యశ్వంత్‌పూర్ వెళ్లే రైళ్లలో పెరుగుదల ఇంకాస్త పెరిగే అవకాశం ఉంది.

జీడీసీసీ బ్యాంకు సీఈఓగా అజయ్ కిషోర్



గుంటూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (జీడీ సీసీ)సీఈఓ నియామ కంపై ఏర్పడిన ప్రతిష్టంభనకు ప్రభుత్వం ఎట్టకేలకు తెరదించింది. జీడీసీసీ బ్యాంకు కొత్త సీఈఓగా సీహెచ్ అజయ్ కిషోర్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు సోమవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఈఓకు సహకార శాఖ రాష్ట్ర ఉద్యోగుల సంఘం నేత మొవ్వా వెంకటేశ్వరరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శికి జైలు

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో నిందితుడైన చీకటీగలపాలెం గ్రామ కార్యదర్శి కనుగంటి మహేంద్రకు కోర్టు జైలు శిక్ష విధించింది. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. గుంటూరు నగరంలోని చైతన్యపురి కాలనీలో నివాసం ఉంటున్న.. ప్రత్తిపాడు మండల పరిధిలోని పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి నాగిరెడ్డి తన చిన్నమ్మ మరణానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం కోసం.. ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ మండలం చీకటీగలపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీకి 2010లో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ సర్టిఫికెట్ ఇవ్వడానికి .. అప్పటి గ్రామ ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ కనుగంటి మహేంద్ర రూ.8వేలు లంచంగా సదరు అన్నపురెడ్డి నాగిరెడ్డిని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సదరు ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ బాధితుని నుంచి 2010 జూలై 12న లంచం డబ్బులను తీసుకొంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేశారు. విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో అతనిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. తదనంతరం సదరు కోర్టు కేసు విచారణ అనంతరం అప్పటి సెక్రటరీ కనుగంటి మహేంద్రకు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానాగా విధిస్తూ సోమవారం కోర్టు తీర్పునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరుగుతుంటే.. దానిని గురించి ఎవరైనా సంబంధిత జిల్లా ఏసీబీ అధికారులకు కాని లేదా ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064కు గాని లేదా మొబైల్ నంబరుకు 94404 40057 కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

సుపరిపాలన తొలి అడుగును విజయవంతం చేద్దాం

● రెవెన్యూశాఖామంత్రి అనగాని

రేపల్లె, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సుపరిపాలన తొలి అడుగును సమిష్టికృషితో విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మంత్రి మాట్లాడారు. జూలై 2 నుంచి నిర్వహించనున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి చేసిన అభివృద్ధి వివరించాలని సూచించారు. ప్రజలు ఇంకా ఏమి ఆశిస్తున్నారో.. తెలుసుకుని పార్టీ అధినాయకత్వానికి తెలియజేయాలన్నారు. ఏడాది కాలంలోనే పింఛన్ పంపు, అన్న క్యాంటీన్‌లు, మత్స్యకార భరోసా, తల్లికి వందనంతో పాటు ప్రతి గ్రామంలో రహదారులు అభివృద్ధి వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు ని వెళ్లాలని సూచించారు. జూలైలో అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమం అమలు చేయబోతున్నట్లు తెలిపారు. గడిచిన 365 రోజుల్లో 365 మంచి పనులు చేసినట్లు ప్రజలకు తెలపాలన్నారు. ఈ సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టుకమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, నియోజకవర్గ పరిశీలకులు ఎం.రామస్వామి, కనగాల మధుసూదన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా ఆకాంక్షలు నెరవేరుస్తున్న ప్రభుత్వం

● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి



రెంటచింతల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తూ.. ఎన్నికల హామీలన్నింటిని నెరవేరుస్తోందని శిల్పారామం చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెంటచింతలలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లికి వందనం పథకం అమలు చేయడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవతో రెంటచింతలలోని సాగు నీటి కాల్వల మరమ్మతులకు రూ.1.33 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జూలై 2 నుంచి ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కాబోతుందని ప్రతి ఒక్కరూ హాజరుకావాలని టీడీపీ శ్రేణులను కోరారు. మాజీ ఎంపీటీసి శివయ్య, మాజీ సర్పంచ్ సుంకయ్య, రాయపరెడ్డి, కొత్త అంజి, కొత్త గోపాలరావు, వై.అప్పయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



పట్టుబడ్డ ట్రాన్స్‌ఫార్మర్ల మెటీరియల్, నిందితులతో పోలీసులు

మాచర్లటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలకొట్టి రాగి వైరు దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,19,620 స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఈ ముఠాను వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి తన సిబ్బందితో కలిసి శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. వెల్దుర్తిలో 13, మాచర్లటౌన్ 1, మాచర్ల రూరల్ 7, దుర్గి 17, కారంపూడి 4, నాగార్జున సాగర్ 15, ప్రకాశం జిల్లా పుల్లల చెరువు 7, యర్రగొండపాలెంలో 3 ట్రాన్స్‌ఫార్మర్లు ముఠా దొంగిలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 305 కిలోల రాగి వైరు, 200 మీటర్ల కేబుల్ వైరు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొగిలి నాగరాజు, గద్దం బయన్న, దార్ల భవాని, దేవర అంజమ్మ నిందితులని వెల్లడించారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సమందర్‌వలి, రూరల్ సీఐ నఫీజ్ బాషా, అర్బన్ సీఐ పచ్చిపాల్ప ప్రభాకరరావు, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కొడుకు అరెస్టు

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు వివరాల ప్రకారం.. చెంబేటి శ్రీనివాస్ (45) తెలంగాణలోని సిద్దిపేటలో బేల్దారి పనులు చేసుకుంటూ నాలు గు నెలలకోసారి మురికిపూడిలోని ఇంటికి వస్తుండేవారు. ఆయన సోరియాసిస్, తలలో రక్తం గడ్డకట్టడం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. కుటుంబ వివాదాల కారణంగా ఈ నెల 7న మద్యం మత్తులో ఉన్న తండ్రిని కుమారుడు చెంబేటి రామకృష్ణ (22).. మద్యం సేవించి వెళ్లి దారుణంగా కొట్టాడు. దెబ్బలకు తండ్రి శ్రీనివాస్ మృతి చెందాడు. నిందితుడు రామకృష్ణను కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు.

విద్యుఘాతంతో రైతు మృతి

దాచేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు గ్రామంలో మేడా సైదారావు(25) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సోమవారం పంట పొలంలో విద్యుత్ పనులు నిర్వహిస్తుం డగా ప్రమాదవశాత్తు ఈ ఘ టన చోటుచేసుకుంది. మృతు డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	96, 104, 115
చికెన్ విత్ స్కిన్(కిలో)	184.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	194.00

38,592 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 41,119 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,592 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,935 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13200	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13400	334	9700	13000
273	---	---	నెంబరు. 5	10000	13300
341	10000	13300	273	---	---
సూపర్ 10	---	---	341	10000	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			4884	10000	12500
తేజ	10000	13400	ఏసీ స్పెషల్ వెరైటీ		
షార్క్-1	---	---	తేజ	10000	13500
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	10000	13000
సింజెంటా బ్యాడిగి	---	---	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	---	---	తాలుకాయలు	4500	7000

పల్నాడు వార్తలు

మున్సిపల్ సాధారణ సమావేశం

పిడుగురాళ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కమిషనర్ ఐ శ్రీనివాసులు వివరించారు. పట్టణంలోని అన్ని వార్డులకు సమప్రాధాన్యతలో నిధులను ఎమ్మెల్యే యరపతినేని మంజూరు చేయించారని, వాటితో సిసి రోడ్లు, డ్రెయిన్లు, పలు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చైర్‌పర్సన్ సుబ్బారావు తెలిపారు. అజెండాలోని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివించాలి:డీఈవో

ముప్పాళ్ళ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా విద్యార్థినులను చదివించాలని డీఈవో చంద్రకళ అన్నారు. సోమవారం మాదలలోని మహాత్మా జ్యోతిభాపూలే బాలికల గురుకుల పాఠశాలను డీఈవో పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మెనూ ప్రకారం భోజన సదుపాయాలు కల్పిస్తున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. డీఈవోవెంట ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు ఉన్నారు.



బ్యాంక్ మేనేజర్‌తో చర్చిస్తున్న రైతులు

దొడ్లేరు గ్రామీణ బ్యాంక్ ముట్టడి

● 4వ తేదీన పరిష్కరించేలా రీజనల్ మేనేజర్ హామీ
● రైతులకు జిల్లా రైతు సంఘం సంఘీభావం

క్రోసూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రెండేళ్ల క్రితం గోల్డ్ అప్రైజర్ నాగార్జున చేతివాటం కారణంగా మాయమైన బంగారాన్ని ఇప్పించాలని కోరుతూ బాధిత రైతులు సోమవారం బ్యాంక్‌ను ముట్టడించారు. వందలాది మంది రైతులు బ్యాంక్ ఎదుట బైఠాయించారు. బ్యాంక్ మేనేజర్ శివశంకర్ నాయక్ రూంలోకి రైతులు దూసుకొనివెళ్లారు. బాధిత రైతులకు జిల్లా రైతు సంఘం సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ రైతులను రీజనల్ మేనేజరుతో మాట్లాడించారు. జూలై 4వ తేదీన సమస్య పరిష్కరించేలా ఆర్‌ఎం పీ సుభాష్ రైతులకు హామీ ఇచ్చారు. 4వ తేదీన సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని జిల్లా రైతు సంఘం ప్రధానకార్యదర్శి ఏపూరి గోపాలరావు ఆర్‌ఎంకు స్పష్టంచేశారు. ఆర్‌ఎం హామీతో ప్రస్తుతానికి ఆందోళన విరమిస్తున్నట్లు రైతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాధిత రైతులతో పాటు జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు తమ్మిశెట్టి హనుమంతరావు, సీపీఎం సీనియర్ నాయకులు ఆవుల ఆంజనేయులు పాల్గొన్నారు.

15 ఏళ్లు నిండిన స్కూల్ బస్సులు నడపరాదు

గురజాలటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్లు నిండిన స్కూల్ బస్సులు నడపరాదని మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రైవేటు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో విద్యార్థులను సిట్టింగ్‌కు మించి ఎక్కించరాదన్నారు. నిబంధనలకు పాటించకుండా స్కూల్ బస్సులు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

దాచేపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని అంకాళమ్మ తల్లి దేవాలయంలో గత ఐదు రోజులుగా వారాహి దేవి నవరాత్రులు జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా శ్రీ లలిత పారాయణం చేస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను మండాది పవన్‌కుమార్‌శర్మ, చలమల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మహిళలు అధికసంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు

పిడుగురాళ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఆకుకూరల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మధుబాబుతో పాటు కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల రైతులు ఆకుకూరలను కొనుగోలు చేశారు. డీటీ సుధాకరశర్మ, పలు గ్రామాల వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో రెండు దరఖాస్తులు

ముప్పాళ్ళ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నగేష్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాల కొరుకు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సత్తెనపల్లి రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మండలంలోని వెన్నాదేవి జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు జీ సాల్మన్‌రాజు, పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు జీ శ్రీనివాసరావు, ఎన్ రమేష్‌బాబు, ఎం మంగతానాయక్‌లకు సోమవారం హైస్కూల్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, వేణు, వేద్రాద్రి, సోలానంబీ, రవి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి: యాగంటి

మాచర్లటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్ ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం గాదె కిరీటిరెడ్డి రిటైర్డ్ ఫంక్షన్‌ను సోమవారం పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమానికి యాగంటి హాజరై కిరీటిరెడ్డిని సన్మానించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న స్కూల్‌బ్యాగ్స్, పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కేసీపీ సిమెంట్స్ చీఫ్ జనరల్ మేనేజర్ రమణ, ఎలక్ట్రికల్ డీజీఎం రామకోటేశ్వరరావు, న్యూటన్స్ కాలేజీ కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, నాసరయ్య, టి.కొండలు, డి.ప్రసాద్‌రావు, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆయిల్ ఫాం మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● పిన్నెల్లిలో 250 ఎకరాల్లో ఆయిల్ ఫాం పంటల సాగుకు ప్రభుత్వం అనుమతి
● రైతుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే యరపతినేని

మాచవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉంటూ వారికి 80శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందజేయటమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పిన్నెల్లి గ్రామంలో రాష్ట్రప్రభుత్వం, భారతీయ ఆయిల్ ఫాం పరిశోధన సంస్థ సాంకేతిక సహకారంతో ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని ముఖ్య అతిథిగా హార్టికల్చర్ వారు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అలాగే పొలాలకు డ్రోన్ సాయంతో పురుగుమందుల పిచికారి విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఆయిల్ ఉత్పత్తి అయ్యే పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయన్నారు. పిన్నెల్లి గ్రామంలోనే 250 ఎకరాల విస్తీర్ణంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టటం హర్షణీయమన్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా ఉన్న పిన్నెల్లిలో నేడు శాంతియుత వాతావరణం నెలకొల్పటమే గాక కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. రైతులు ఆయిల్‌ఫాం సాగు కు ముందుకు వస్తే దాచేపల్లి, గురజాల మండలాల్లో కూడా మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయిల్ ఫాం సీఈవో రామకృష్ణ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ వెంకటరావు, ఎం నగేష్, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో చిరంజీవి, స్థానిక టీడీపీ నాయకులు చింతపల్లి నన్నె, సుభానీ, రామిరెడ్డి, సుభానీ, శేఖర్, అమరనాథ్, దస్తగిరి, మండల పార్టీ కన్వీనర్ బడిగుంతల వెంకటేశ్వర్లు, హార్టికల్చర్ అధికారులు అంజలిబాయి, మోహన్, ఏవో రామమ్మ పాల్గొన్నారు.

శీనయ్య.. చూడాలని వచ్చానయ్యా..

దాచేపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రామాపురంలో ఓ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసేందుకు గ్రామానికే చెందిన గుర్రం రాములమ్మ అనే వృద్ధురాలు వచ్చింది. ఆమెను చూసిన యరపతినేని ఆమెను పలకరించారు. శీనయ్య.. నిన్ను చూడాలనే వచ్చానయ్యా అంటూ ఆమె ఆనందం వ్యక్తంచేసింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం మండల ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన కార్యక్రమాలు రానున్న నాలుగేళ్లలో చేయను న్న అభివృద్ధి పనులను ప్రజలకు తొలి అడుగు కార్యక్రమం ద్వారా వివరించాలన్నారు. ఇంకా నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు నాగోతు శౌరయ్య, కుర్రా అప్పారావు, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, పల్నాడు జిల్లా టీడీపీ నాయకుడు పఠాన్ నూర్జహాన్, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, నాయి బ్రాహ్మణ కార్పోరేష్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పెనుముచ్చు రామారావు, భాష్యం ఆంజనేయులు, మాదినేని సుబ్బయ్య, వట్టికూటి శివరామకృష్ణయ్య, ఏటుకూరి బ్రహ్మయ్య, ఏటుకూరి రత్నకుమార్, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, సరిపూడి కృష్ణ కుమారి, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, మద్దినేని వెంకట సత్యనారాయణ, మోదుగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుడివాడ ఎమ్మెల్యేని సత్కరించిన ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం సత్కరించారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే రామును ప్రవీణ్ దుశ్శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.



గుడివాడ ఎమ్మెల్యే రామును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, ఇన్‌సెట్‌లో చైర్‌పర్సన్ లక్ష్మీ తులసి



రెండు వార్డులకే రూ.ఐదు కోట్లా?

● చైర్‌పర్సన్ చాంబర్‌లో మధ్యవర్తులకు స్థానమేంటని ప్రశ్నించిన జనసేన కౌన్సిలర్ సుమన్

సత్తెనపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రెండు వార్డులకే రూ.5కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారని, ఆ వార్డులపై ఇంత ప్రత్యేక శ్రద్ధ ఏంటని? మునిసిపల్ వైస్‌చైర్మన్ కోటేశ్వరరావు నాయక్ ప్రశ్నించారు. సోమవారం మునిసిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన మునిసిపల్ సమావేశం జరిగింది. సమావేశంలో కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ పట్టణంలోని మిగతా వార్డులకు కూడా నిధులు కేటాయించాలని అధికారులను కోరారు. తన వార్డులో చిన్న పని అడిగినా నేటికీ కేటాయించలేదన్నారు. నిధులు అవసరమైన చోటే ఖర్చు చేస్తున్నామని కమిషనర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఉన్న ప్రకటన బోర్డులు ఎన్ని.. పురపాలక సంఘానికి వాటివల్ల వచ్చే ఆదాయం ఎంతో వివరాలను తెలపాలని వైసీపీ కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కోరారు. పట్టణంలో డివైడర్ల మధ్య ఏర్పాటుచేసిన ఫ్లెక్సీబోర్డులకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించగా టీపీవో సమాధానం ఇచ్చారు. పురపాలక సంఘ కార్యాలయం వైసీపీ మధ్యవర్తుల కార్యాలయంగా మారిందని జనసేన కౌన్సిలర్ సుమన్ ఆరోపించారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ చాంబర్‌లో వారు కూర్చొనేందుకు స్థానమెందుకు కల్పిస్తున్నారని? కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తగు చర్యలు చేపడతామన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ కటకం రామకృష్ణ అజెండాలోని 9వ అంశానికి డీసెంట్ నోటీసు ఇచ్చారు. పలు అంశాలపై కౌన్సిలర్లు మాట్లాడారు. అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగుల్ మీరాన్, అచ్యుత శివప్రసాదు, పెద్దింటి గోవిందమ్మ, కూకుట్ల లక్ష్మి, బండి రాజ్యలక్ష్మి, ఆనంద్, ఆకుల రమేష్, పలువురు టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లతో పాటు మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

● గురజాల డీఎస్పీ జగదీష్

మాచర్లటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇరువురు వ్యక్తులకు అదుపులోకి తీసుకున్నట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ వార్డుకు చెందిన మంజుల దాసు తన ద్విచక్రవాహనం పోయిందని పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్‌ఐ సంధ్యారాణి సీసీ కెమెరాలను పరిశీలించి వాటి ఆధారంగా సోమవారం ఉదయం పట్టణంలోని పార్కు సెంటర్లో సంచరిస్తున్న మాచవరం మండలం గంగిరెడ్డిపాలెంకు చెందిన మల్లెల దేవకుమార్, మండలపాటి గోపికృష్ణలను అదుపులోకి తీసుకొని విచారించారు. మూడు బైకులను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ నఫీజ్‌బాషా పాల్గొన్నారు.

విజేతలకు ప్రోత్సాహక బహుమతులు

పెదకూరపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ఎంఈవో ఏకుల ప్రసాదరావు ప్రోత్సాహక బహుమతులను అందించారు. పెదకూరపాడు జడ్పీ హైస్కూల్‌లో సోమవారం జరిగిన పిల్లల విద్య, తల్లి పాత్ర అనే అంశంపై పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి పోటీలు

మాచర్ల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తల్లికి వందనం పథకంపై నియోజకవర్గస్థాయి పోటీలు జరిపారు. విజేతలకు ఎంఈవో అల్లి సురేష్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్లగూడెం-వెంకటాయపాలెం అటవీమార్గాన్ని పునరుద్ధరించండి



గుంటూరులో ఫారెస్టు కన్జర్వేటర్ కాశీ విశ్వనాథరాజుతో మాట్లాడుతున్న అచ్చంపేట మండల గిరిజన నాయకులు

అచ్చంపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగూడెం నుంచి వెంకటాయపాలెం వరకు అటవీమార్గాన్ని పునరుద్ధరించాలని సోమవారం అచ్చంపేట మండల గిరిజన నాయకులు ఫారెస్టు కన్జర్వేటర్ కాశీ విశ్వనాథరాజు, డీఎఫ్‌వో కృష్ణప్రియలను గుంటూరులో కలసి కోరారు. ఈ మార్గం పురాతన కాలం నుంచే ఉందని, ఈ మార్గంలో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు కూడా తిరిగాయని తెలిపారు. వెంకటాయపాలెం-పుట్లగూడెం అటవీ మార్గంలో గిరిజన దేవత తుల్జా భవానీ ఆలయం కూడా ఉందన్నారు. అఖిల భారత గిరిజన వికాస్ పరిషత్ అధ్యక్షుడు బీటీ నాయక్, భూక్యా స్వర్ణమ్మ రమేష్, వెంకటాయపాలెం సర్పంచ్ భూక్యా నాగమ్మ, శ్రీనివాస్‌నాయక్, మేశం శ్రీరామమూర్తి, డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ కరస్పాండెంట్ షాపులో చోరీ

మాచర్లటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ పాయింట్)లో చోరీ జరిగినట్లు నిర్వాహకుడు బొబ్బిలి శ్రీనివాసరావు పట్టణ పోలీస్‌స్టేషన్లో సోమవారం ఫిర్యాదుచేశారు. మధ్యాహ్నం షాపు షట్టర్ కిందకు దించి బయటకు వెళ్లి సాయంత్రం షాపు తిరిగి ఓపెన్ చేయగా కౌంటర్‌లో ఉన్న రూ.90వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య శిబిరం

గురజాలటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాగ్దేవీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో సోమవారం శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మద్దినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ సాంబశివరావు, ఉల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

రెంటచింతల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఎంపీడీవో కె.సరోజనిదేవి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎంలు కత్తి రవి, దుర్గాప్రసాద్, ఎం.రాంబాబు, కిరణ్,మంగయ్య, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, టీచర్లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

మాచర్ల రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడోమైలులో గల బాలికల రెసిడెన్షియల్ ఆశ్రమ పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యాన రూ.20వేల విలువైన 10 ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, ప్రిన్సిపాల్ దుర్గాభవాని, పఠాన్ నాగూర్‌వలి, జేవీకేఎస్ ప్రసాద్, కూరపాటి శ్రీనివాసరావు, తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, నిమ్మగడ్డ సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌వర్కర్‌లకు సత్కారం

మాచర్ల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్‌వర్కర్‌గా విధులు నిర్వహించిన చెరుకూరి అంజమ్మ, అవుట్ సోర్సింగ్ పబ్లిక్ వర్కర్లు కంభంపాటి గురవయ్య, ఏసమ్మలు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సిద్ధమ్మ సిద్ధయ్య, కమిషనర్ వేణుబాబులు వారిని ఘనంగా సన్మానించారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలి

సీపీఎం నాయకుల పిలుపు

క్రోసూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అడ్డుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి జీ రవిబాబు పిలుపునిచ్చారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల సీపీఎం సమావేశం సోమవారం రావిళ్ళ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రవిబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ముందుగానే మీటర్లకు కూడా రీచార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు హనుమంతరావు, వెంకటేశ్వర్లు, ఏసయ్య, ఎలిశమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ నివేశన స్థలాలివ్వాలి

క్రోసూరు మండలంలోని నిరుపేదలందరికీ నివేశనస్థలాలు ఇచ్చి గృహం నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరుచేయాలని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. తొలుత క్రోసూరు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యుడు బైరాపట్నం రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి, యాదగిరి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కేజీబీవీలో ఎంపీపీ తనిఖీ

అచ్చంపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి సోమవారం తనిఖీచేశారు. విద్యార్థినుల సంఖ్య, బోధనా విధానం, ఆహారపదార్థాల నాణ్యత తదితర విషయాలను ఎస్‌వో దీప్తిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు మరింత మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ





కిసాన్ డ్రోన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కిసాన్ డ్రోన్‌లతో తగ్గనున్న ఖర్చు.. శ్రమ

● ఎమ్మెల్యే కన్నా

ముప్పాళ్ళ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కిసాన్ డ్రోన్‌లు రైతులకు శ్రమను, ఖర్చును తగ్గిస్తాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ముప్పాళ్ళ హై స్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన చంద్రబోస్ గ్రూపునకు, బొల్లవరం గ్రామానికి చెందిన సిద్ధి విఘ్నేశ్వర గ్రూపులకు 80శాతం రాయితీపై కిసాన్ డ్రోన్‌లను ఎమ్మెల్యే కన్నా పంపిణీ చేశారు. తక్కువ ధరకు రైతులకు అందుబాటులో ఉంచాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, ఏఓ ఎస్ శ్రీధర్ రెడ్డి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం గోళ్ళపాడులోని కేజీబీవీలో అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాలకు రూ.2కోట్ల వ్యయం కాగల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

ట్రైసైకిల్ పంపిణీ

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నేత వెలుగూరి వెంకటేశ్వర్లు వర్ధంతిని సోమవారం ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒక దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను, నిరుపేద మహిళకు వెట్ గ్రైండర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగూరి శరత్‌బాబు, జెమలి రాధాకృష్ణమూర్తి, బచ్చు కొండలు, జవ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి మండల స్థాయి అధికారులు డుమ్మా

బెల్లంకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి ఆయా గ్రామాల రైతులు వారి సమస్యలపై అధికారులకు అర్జీలు ఇవ్వటానికి వచ్చారు. కానీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఒక్కరే ప్రజావాణికి హాజరయ్యారు. మిగిలిన మండల స్థాయి అధికారులు ఎవ్వరూ హాజరుకాకపోవటంతో అర్జీదారులు వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రజావాణికి అధికారులు రాలేదని పేర్కొన్నారు.

సాగుదారుల చట్టంపై అవగాహన

రాజుపాలెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం, బీరవల్లిపాయ, నెమలిపురి, బలిజేపల్లి తదితర గ్రామాలలో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో సోమవారం సాగుదారుల చట్టంపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ జి.కోటరత్నం అధ్యక్షతన ఆయా గ్రామాలలో సమావేశాలు ఏర్పాటుచేసి సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కౌలు రైతులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుర్గి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాచర్ల సబ్‌స్టేషన్‌లో 33కేవీ రీఓరియంటేషన్ వర్క్స్ జరుగుతున్నందున 33కేవీ దుర్గి ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు డీఈఈ రామయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మవరం, శ్యామరాజపురం గ్రామాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

కారు తగిలి కానిస్టేబుల్‌కు గాయాలు

అమరావతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగోడు గ్రామంలో ఇసుక అక్రమరవాణా నివారించేందుకు నదీతీరంలో గాడులు తీయించేందుకు రెవెన్యూ అధికారులతో ఎస్‌ఐతోపాటు నలుగురు సిబ్బంది సోమవారం గ్రామానికి వెళ్లారు. పోలీసులను చూసి తనకోసమే వచ్చారనుకుని వివిధ దొంగతాలలో నిందితుడైన కొలికొండ వెంకట్రావు కారులో వెళుతూ స్పీడుగా పోనిచ్చి పారిపోయాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ పి.రత్నబాబుకు కారు తగిలి కిందపడగా చేతికి గాయాలయ్యాయి. రత్నబాబు ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 18.79 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 1700 క్యూసెక్కులు, లీకుల ద్వారా 300, మొత్తం 2వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

కోలగుట్లలో పొలం పిలుస్తోంది

దుర్గి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగుట్లలో నరసరావుపేట డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నగేష్ పత్తి పంటను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో అమ్మిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈకి ఘన సన్మానం

అమరావతి: అమరావతి హౌసింగ్ ఏఈ, ఉమ్మడి గుంటూరు జిల్లా హౌసింగ్ ఏఈల సంఘ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు సోమవారం పదవీవిరమణ చేశారు. మండలపరిషత్ కార్యాలయంలో ఆయనకు సన్మానసభ జరిగింది. హౌసింగ్ జిల్లా అధికారులు, సంఘనాయకులు, వివిధ మండలాల ఏఈలు వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.

రోగుల కృతజ్ఞతే సంతృప్తి



ఏరియా వైద్యశాలలో గర్భిణిని పరీక్షిస్తున్న గైనకాలజిస్టు బీ అరుణ

● ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం డాక్టర్ ● రోగికి, వైద్యులకు ప్రత్యేకమైన అనుబంధం ● వైద్య వృత్తిపై మక్కువతో వైద్యుల సేవలు.. ● నేడు వరల్డ్ డాక్టర్స్ డే..

సత్తెనపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన గమ్యంలో ఎన్ని రంగాలను ఎంచుకున్నా.. అన్నింటిలోకి భిన్నమైనది వైద్య వృత్తి. ఇదొక బాధ్యత. ధనం, పేరుప్రఖ్యాతలు కాదు.. తనను నమ్మి వచ్చిన రోగి ఆరోగ్యం మెరుగుపరిచి, ప్రాణం నిలబెట్టిన రోజు వారి కళ్లలో కనిపించే నిజమైన కృతజ్ఞతా భావం వైద్యులకు నిజమైన సంతృప్తిని స్తాయి. ప్రస్తుతం ధనమే పరమావధిగా అన్ని రంగాలు కొన్ని కళంకాలను అద్దుకుంటున్నా.. వైద్య వృత్తిని దైవ సమానంగానే భావిస్తారు. వైద్యో నారాయణ హరి అని ప్రాచీన సంస్కృత అనుబంధం. వైద్యులు అంటే ప్రజలకు ఒక నమ్మకం. విశ్వాసం. ప్రాణాలు పోసే దేవుడు. వైద్యుడు, రోగి మధ్య ఉన్న బలమైన బంధం ఉంటుంది. వైద్యుల సేవలను గుర్తించి, గౌరవించుకునేందుకు.. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా జూలై 1న డాక్టర్స్ డేని జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్ రెండవ ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ సుందర్‌రాయ్ జ్ఞాపకార్థం మనం వైద్యుల దినోత్సవం నిర్వహించుకుంటాం.

వైద్యులంటే ఒక నమ్మకం

తమ సొంత కుటుంబ సభ్యులకు సైతం వెల్లడించని రహస్య సమాచారాన్ని వైద్యులకు మాత్ర మే రోగులు చెపుతారు. తమ శరీరాన్ని పరీక్షించేం దుకు నిరభ్యంతరంగా అంగీకరిస్తారు. ఈ స్థాయి లో నమ్మకం, విశ్వాసాన్ని పొందటమనేది మరియే ఇతర వృత్తిలో ఉండదు. ప్రజల నుంచి ఇంతగా విశ్వాసాన్ని పొందుతున్న వైద్యులు.. నమ్మకాన్ని కాపాడు కోవాలి. తమ విధుల పట్ల అంకిత భావాన్ని ప్రదర్శించాలి. కొన్ని సంవత్సరాలుగా పలు కారణాల వల్ల వైద్యులు, ఇటువంటి అద్వితీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకొనేందుకు వైద్యుల దినోత్సవం కన్నా మంచి తరుణం లేదు. ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్లు ఆంధ్రజ్యోతికి తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

తండ్రి కోరిక మేరకు..



తన తండ్రి జాన్ సైమన్ కోరిక మేరకు డాక్టర్‌ను అయ్యా ను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచి వైద్య రంగం అంటే చాలా మక్కువ ఏర్పడింది. గైనకాలజిస్టుగా.. 25 ఏళ్ల నుంచి రోగులకు సేవలు అందించడం ఎంతో సంతో షంగా ఉంది. ముఖ్యంగా గర్భిణులకు సేవలు అందించడం చాలా ఆనందంగా ఉంది.

-డాక్టర్ బి.అరుణ, గైనకాలజిస్టు

తల్లిదండ్రుల కృతజ్ఞతలతో సంతృప్తి



నా తండ్రి మోహన్‌రావు వైద్య ఆరోగ్య శాఖలో పని చేసేవారు. చిన్నప్పటి నుంచి డాక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ గురించి మాకు తెలియజేసేవారు. తండ్రి ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ పూర్తి చేసి.. చిన్న పిల్లల డాక్టర్‌ను అయ్యాను. పిల్లలకు వైద్య సేవలు అందించినప్పుడు వారి తల్లిదండ్రులు చూపే కృతజ్ఞతలు సంతోషంగా ఉంటాయి.

-డాక్టర్ లక్ష్మణరావు, చిన్న పిల్లల డాక్టర్

17 ఏళ్లుగా సేవలు



తండ్రి వాసుదేవరాజు రైతు. చిన్నప్పటి నుంచి నేను డాక్టర్ కావాలని చెబుతుండేవారు. ప్రపంచంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి... వైద్య వృత్తి అని చెప్పే వారు. ఆయన కోరిక మేరకు ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండీ జనరల్ పూర్తి చేశాను. 17 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో రోగులకు సేవలు అందించడం సంతోషంగా ఉంది.

- డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్

1.70 లక్షల కుటుంబాలకు.. ముందస్తు రేషన్

● ప్రభుత్వం కల్పించిన అవకాశం సద్వినియోగం
● క్యూలైన్ కష్టాలు తప్పాయని వృద్ధులు, దివ్యాంగుల సంతోషం
● ఈ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను తీసుకోవడంలో వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంచి ఫలితాన్ని ఇచ్చింది. జూలై నెలకు సంబంధించిన రేషన్ సరుకులను జూన్ 25 నుంచే తీసుకొనే వెసులుబాటుని ప్రభుత్వం కల్పించింది. ఐదు రోజులుగా మూడు జిల్లాల్లో చాలా మంది దీనిని సద్వినియోగం చేసుకున్నారు. సగటున ఒక్కో జిల్లాలో 55 వేల మందికి పైగా సరుకులను తీసుకెళ్లారు. దీంతో మంగళవారం అందరికి ప్రారంభం కానున్న రేషన్ సరుకుల పంపిణీలో వృద్ధులు, దివ్యాంగులకు కష్టాలు తప్పాయి. ఈ విధానం శాశ్వతంగా కొనసాగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గత నెల నుంచి రేషన్ పంపిణీ విధానాన్ని ప్రభుత్వం మార్చింది. అంతకుముందు వరకు వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థ ద్వారా సరుకుల పంపిణీ జరిగింది. అయితే ఈ విధానం వల్ల ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడింది. దీనికి తోడు ఎండీయూ ఆపరేటర్లు నేరుగా లబ్ధిదారులకు సరుకులకు బదులు నగదు ఇచ్చి వాటిని మాఫియాకి చేరుస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. తిరిగి రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేపట్టింది. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు వెళ్లి రేషన్ సరుకులు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే డీలర్లకు వీలుకాక పోవడం, కొందరు ఎండీయూ ఆపరేటర్ల లాగానే.. ఈ-పోస్ యంత్రం తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకొని సరుకులకు బదులు నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈ నెల నుంచి దివ్యాంగులు, వృద్ధులకు ఐదు రోజుల ముందుగానే సరుకులు పంపిణీ చేసేలా పీడీఎస్ సిస్టంలో ప్రభుత్వం మార్పులు చేసింది. అందులో భాగంగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి కొన్ని రోజులు ముందుగానే సరుకులను డీలర్ల దుకాణాలకు చేర్చారు.

జూన్ 25 - 30 మధ్యన రేషన్ తీసుకొన్న వృద్ధులు, దివ్యాంగులు

జిల్లా పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం శాతం
పల్నాడు	79736	12.55
బాపట్ల	56311	11.81
గుంటూరు	44411	7.51

పల్నాడు జిల్లాలో అధికం..

ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని రాష్ట్రంలోనే ఎక్కువ సంఖ్యలో పల్నాడు జిల్లాలోని లబ్ధిదారులు వినియోగించుకొన్నారు. ఆ తర్వాత స్థానంలో బాపట్ల జిల్లా, 18వ స్థానంలో గుంటూరు జిల్లా ఉంది. షాపుల వద్దకు వెళ్లగలిగే స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు తమకు సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి నిమిషాల వ్యవధిలోనే సరుకులు తీసుకోగలిగారు. ఈ విధానం ఎంతో బావుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి క్యూలైన్లలో నిలుచోవాల్సిన అవసరం లేకుండా పోయిందంటున్నారు. కాగా ఇప్పటికే 10 శాతం పైగా సరుకులు తీసుకొన్నందున ఆ మేరకు మంగళవారం నుంచి లబ్ధిదారులందరికి ప్రారంభమయ్యే సరుకుల పంపిణీ సందర్భంగా కొంత మేరకు రద్దీ తగ్గుతుందన్న అభిప్రాయం డీలర్లు, పౌరసరఫరాల అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



వరద నీటి నిర్వహణ.. పర్యాటక ఆకర్షణ

(5వ పేజీ తరువాయి)

నిర్వహణలో ఈ రిజర్వాయర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. కాగా శాఖమూరు రిజర్వాయర్‌ను కేవలం రిజర్వాయర్‌గానే కాకుండా పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ ప్రయత్నిస్తోంది. ఫ్లవర్ గార్డెన్, క్రాఫ్ట్ బజార్, అమ్యూజ్‌మెంట్ పార్కు, మ్యూజికల్ ఫౌంటేన్, లేజర్ షో ఏర్పాటు చేయడంతోపాటు, రిజర్వాయర్లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దాంతోపాటు వాకింగ్ ట్రాక్, యోగా, మెడిటేషన్ హాళ్లను కూడా ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది.

● పూర్తయిన పూడిక తీత

50 ఎకరాల్లో నిర్మిస్తున్న శాఖమూరు రిజర్వాయర్ పూడిక తీత పనులు నూరుశాతం పూర్తయ్యాయి. వరద నీరు రిజర్వాయర్‌లోకి రాకుండా మట్టితో ఆనకట్టలు కట్టి అడ్డుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో స్వల్పంగా నీరు చేరింది. ఆ నీటిని మోటార్లతో తోడుతూ పనులు కొనసాగిస్తున్నారు. రిజర్వాయర్‌కు ఫస్ట్ లెవెల్ కాంక్రీట్ ఫౌండేషన్ పనులు దాదాపు తుది దశకు చేరాయి. తొలి దశ ఫౌండేషన్ పనుల్లో భాగంగా వాటర్ ప్రూఫ్ షీటు అమర్చి, దాని మీద గ్యాబిన్ మెస్ ఏర్పాటు చేసి దాంట్లో రాళ్లు నింపి ఫౌండేషన్ లేయర్‌ను రూపొందించారు. ఈ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ వారంలో అది కూడా పూర్తవుతుందని నిర్మాణ సంస్థ చెబుతోం ది. కాగా పార్కు చుట్టూతా ఫెన్సింగ్ ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి.

ఆగంతకులకు రాచమార్గం

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం వేకువజామునకు ముందు పిడుగురాళ్ల, తుమ్మలచెరువు మధ్యన విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి జరిగిన ప్రయత్నంలో పోలీసులు జరిపిన కాల్పుల ఉదంతం.. రైల్వేలో భద్రతపై మళ్లీ అనుమానాలను రేకెత్తిస్తోంది.

ఈఎఫ్‌టీలో నిబంధనకు నీళ్లు..

బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి యువకులు పనుల కోసం ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. వీళ్లంతా ఎక్కువగా విశాఖ, ఫలక్‌నుమా, అమరావతి, ప్రశాంతి, సిల్చార్, ఎల్‌టీటీ, భావనగర్, నాగర్‌సోల్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రిజర్వేషన్ చేసుకొంటే వాళ్ల వివరా లన్నీ రైల్వే డేటాలో రికార్డు అవుతాయి. దాంతో ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే జనరల్ టిక్కెట్ తీసుకొని స్లీపర్, ఏసీ త్రీటైర్‌లో ఎక్కేస్తుంటారు. బోగీల్లో ఖాళీలు లేకపోతే టీటీఈలు వీళ్లని తదుపరి రైల్వేస్టేషన్‌లో దింపేయాలి. ఒకవేళ ఖాళీలు ఉంటే ఈఎఫ్‌టీ రాసి అందులో ప్రయాణికుల పేర్లు, మొబైల్ నంబర్లు నమోదు చేయాలి. దాని వల్ల ఐడెంటిటీ అనేది పక్కాగా అందుబాటులో ఉంటుంది. అయితే టీటీఈలు ఈ పని చేయడం లేదు. బెర్తులు ఖాళీలు లేకపోయినా ఈఎఫ్‌టీ రాస్తున్నారు. అందులోనూ వివరాలు సరిగా నమోదు చేయడం లేదు. దీని వల్ల రైళ్లలో ఏదైనా నేరం జరిగినా నేరస్తులను గుర్తించడం కష్టతరమవుతోంది.

ఆగంతకులకు ఆహ్వానం..

ఆదాయ లక్ష్యాలను అధిగమించేందుకు టిక్కెట్ కలెక్టర్లు కొన్ని ప్రధానమైన స్టేషన్లలో రైళ్ల బోగీల వద్ద బయట ఉండి ఈఎఫ్‌టీలు రాసి లోపలికి అనుమతి స్తున్నారు. పైన పేర్కొన్న ఏ రైలు గుంటూరు వచ్చినా స్లీపర్ క్లాస్‌లో కాలు పెట్టడా నికి కూడా ఖాళీ ఉండదు. చాలా మంది జనరల్ టిక్కెట్లతో.. ఫుట్ బోర్డు, టాయ్‌లె ట్స్ వద్ద కూర్చుని ఉంటారు. గతంలో ఏసీ త్రీటైర్‌లో కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్ర యాణి కులనే అనుమతించే వారు. ఇప్పుడు వాటిల్లోనూ ఈ ఆగంతకులను అనుమ తిస్తుం డటంతో భద్రత ప్రశ్నార్థకమైంది. సికింద్రాబాద్ వెళ్లే రైళ్లన్నీ అర్ధరాత్రి వేళ సత్తెన పల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లకు చేరుకొంటుంటాయి. ఆ సమయంలోనే ప్రయాణికులు కాస్తంత కునుకు తీస్తుంటారు. అప్పుడు దోపిడీ దొంగలు నిర్మానుష్య ప్రదేశంలో చైన్ లాగి.. రైలుని ఆపి దోచుకోవడానికి ప్రయత్ని స్తున్నారు. సకాలంలో ఆర్‌పీఎఫ్ గార్డులు స్పందిస్తే సరి.. లేకుంటే ప్రయాణికుల సొ త్తుని భారీగా దోచుకొంటున్నారు. ఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోతే ప్రయాణికుల ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రూ.6కోట్ల బకాయిలపై మున్సిపల్ కాంట్రాక్టర్ల ఫిర్యాదు

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విషయంపై కాంట్రాక్టర్లు సోమవారం నరసరావుపేటలో జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. 2022 నుంచి ఇప్పటివరకు చేసిన పనులకుగాను సుమారు రూ.6కోట్లు మున్సిపాలిటీ వారు బకాయిగా ఉన్నట్టు సీనియర్ మునిసిపల్ కాంట్రాక్టర్ గోవిందు శంకర శ్రీనివాస్ తెలిపారు. హైకోర్టులో కేసువేసి బిల్లులు చెల్లించాలని కోర్టు ఆదేశాలు తెచ్చుకున్నామన్నారు. అయినప్పటికీ మున్సిపాలిటీ వారు బిల్లులు చెల్లించడం లేదన్నారు. కాంట్రాక్టర్లు వి.శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం: జీవీ

వినుకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఇంటింటి సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో ప్రయోజనం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. జూలై 2వ తేదీ నుంచి నియోజకవర్గం మొత్తం విస్తృత ప్రచారం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాది విజయాలు తెలియజేయడంతో పాటు ప్రజల్లోకి వెళ్లి చేసిన మంచిని వివరించనున్నామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా జూలై 2వ తేదీ నుంచి నిర్వహించనున్న సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం గురించి వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్, కో కన్వీనర్, గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడు తదితరులు పాల్గొనాలన్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌పై జగన్ విమర్శలు అర్థరహితం

● కూరపాటి

నరసరావుపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఈసెట్ కౌన్సెలింగ్ 2022 సెప్టెంబరులో, 2023 జులై ఆఖరుకు కౌన్సెలింగ్ పూర్తి చేశారని ఇప్పుడు ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహణపై జగన్‌మోహన్‌రెడ్డి విమర్శలు అర్థరహితమని టీఎన్ఎస్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతురావు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థను గాడిలో పెట్టడం జరిగిందన్నారు. ఉద్యోగ కల్పనకు ఆయన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు.

మాలలకు ప్రత్యేక శ్మశానం కేటాయించాలి

వినుకొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో నివాసం ఉంటున్న మాలలకు ప్రత్యేక శ్మశాన స్థలం కేటాయించాలంటూ మాల మహానాడు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సురేష్ నాయక్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కోంద్రు విజయ్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆదేశాల మేరకు ఇప్పటివరకు మాలలకు ప్రత్యేక శ్మశానం కేటాయించకపోవడం బాధాకరమని, అధికారులు స్పందించి శ్మశానం కోసం భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం

నూజెండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు ప్రాథమిక పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్ళిన కన్నెబోయిన శ్రీనివాసరావు, లగడపాటి అచ్చయ్యలను నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు.

ఐదు క్లబ్బులకు అసిస్టెంట్ గవర్నర్‌గా పోలిశెట్టి రాఘవయ్య నియామకం

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా స్థానిక పండరీపురం రోటరీ క్లబ్బుకు చెందిన పోలిశెట్టి రాఘవయ్య ఏడాది కాలానికి నియమితులయ్యారు. బాపట్ల, పెదనందిపాడు, నరసరావుపేట, చిలకలూరిపేట, పండరీపురం రోటరీ క్లబ్బులకు ఆయన అసిస్టెంట్ గవర్నర్‌గా సేవలనందిస్తారు.

50 మందికి వైద్యసేవలు

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేవా సంస్థ ఓయాసిస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పండరీపురంలో కేజే ఆసుపత్రి ఆవరణలో ఉచిత ఎనీమియా (రక్తహీనత) వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ళ జయమ్మ ఆధ్వర్యంలో శిబిరంలో 50మందికి రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు.

నా ఓటు-నా హక్కుపై అవగాహన

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోడరన్ డిగ్రీ కళాశాలలో సోమవారం నా ఓటు-నా హక్కు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ విజ్ఞతతో ఓటు వేసేందుకు రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, భారతదేశం సుసంపన్నం కావాలంటే డబ్బులు తీసుకోకుండా ఓట్లు వేయాలని అన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోడరన్ విద్యా సంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లావ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుంచి 180అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కారించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖలు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి కే మురళి అర్జీలు స్వీకరించారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతిపై విచారణ జరిపించాలి: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఉపాధి హామీ పనులలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో వైసీపీ పంచాయతీరాజ్ విభాగం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు వచ్చే రూ.300ల వేతనం మీకు సగం, మాకు సగం అన్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్‌లు వ్యహరిస్తున్నారన్నారు. రాని వారి మస్టర్లు వేసుకొని ఈ రూ.300లు వీళ్ళే తీసుకుంటున్నారని అన్నారు. కేంద్రప్రభుత్వం విడుదల చేసిన 15 ఫైనాన్స్ నిధులు రూ.1150 కోట్లు తక్షణమే స్థానిక సంస్థలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ నిధులను దారి మళ్ళించి వివిధ పథకాల కోసం రాష్ట్రప్రభుత్వం వాడుకుంటుందన్నారు. సర్పంచ్‌లను పనులు చేయకుండా సెక్రటరీలను అడ్డుకొని కూటమి నాయకులు పనులు చేయకుండా ఆపుతున్నారని ఆరోపించారు. తల్లికి వందనం సర్పంచ్‌లకు ఇవ్వడంలేదన్నారు. నెలకు రూ.12వేలు జీతం తీసుకునే ఆవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం వర్తింపజేస్తూ, నెలకు రూ.3 వేలు తీసుకొనే సర్పంచ్‌లకు ఆపడం దారుణం అన్నారు. రాష్ట్రంలో గ్రేడ్ 1 పంచాయితీ సెక్రటరీలకు 1350కి పోస్టింగ్‌లు ఇవ్వలేదన్నారు. తక్షణమే వారికి పోస్టింగ్ ఇచ్చి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ పడాల చక్రారెడ్డి, సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, నియోజకవర్గ నారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి వేడుకల సందర్భంగా వినుకొండ పట్టణంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన తొలిఏకాదశి తిరునాళ్ళకు భారీగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పోలీసులకు దిశానిర్దేశం చేశారు. భక్తులు ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకునేలా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధాన కూడళ్లలో భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలు గమనించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. క్యూలైన్‌లు, బారికేడ్ల వద్ద సిబ్బందిని కేటాయించాలన్నారు. సీఐలు శోభన్‌బాబు, ప్రభాకర్‌రావులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డును పరిశీలించిన డీఎస్పీ

వినుకొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీన జరిగే రామలింగేశ్వరస్వామి తొలి ఏకాదశి పండుగ సందర్భంగా కొండకు వచ్చే భక్తులకు శాంతిభద్రతలు కల్పించేందుకు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘాట్‌రోడ్డును పరిశీలించారు. పండుగ రోజు కొండకు వచ్చే భక్తులు, కొండపైకి చేరుకునే బస్సులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఏపీ ప్రాంతాల్లో రక్షణచర్యలు చేపట్టాలో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు కొండకు చేరుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని డీఎస్పీ నాగేశ్వరరావు సిబ్బందికి తెలిపారు. రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాల వద్ద శాంతిభద్రతలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

కార్యక్రమంలో సీఐలు శోభన్‌బాబు, ప్రభాకర్, ఎస్ఐలు షమీర్‌బాషా, సత్యనారాయణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

కౌన్సిల్ సమావేశంలో చిలకలూరిపేట కౌన్సిలర్లు


సమావేశానికి అధ్యక్షత వహించిన మునిసిపల్ చైర్మన్ రఫాని

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ వార్డులలోని సమస్యలపై సోమవారం చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు గళమెత్తారు. వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన కాల్వల్లో పూడికలు తీయక పట్టణంలో మురుగునీరు గణపవరం వ్యవసాయ భూముల్లోకి వస్తోందని ఆరోపించారు. కౌన్సిలర్ ఎ.శ్రీలక్ష్మి మాట్లాడుతూ విశ్వనాథ్ సెంటర్లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. కౌన్సిలర్ వి.కోటానాయక్ ప్రతి వార్డుకి రూ. 5 లక్షలు ఇస్తామని ప్రకటించి ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ అమృత్ పథకం అమలుపై నిలదీశారు. పట్టణంలో తాగునీటి ట్యాంకర్లు అద్దెకు తీసుకురావాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. పైపు లైన్ లీకేజీలు ఎందుకు ఎక్కువగా వస్తున్నాయని ప్రశ్నించారు. కౌన్సిలర్ కె.ప్రమీల మాట్లాడుతూ పాత విజయ బ్యాంకు పక్కన ఉన్న రోడ్డు అంతా గుంతలమయంగా ఉందని, తక్షణమే బాగు చేయాలన్నారు. కౌన్సిలర్ యడ్ల ఇందిర మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టలేదని, కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. కౌన్సిలర్ జంగా సుజాత మాట్లాడుతూ ఎన్నోమార్లు విజ్ఞప్తులు చేసినా తమ వార్డులో కొండ్రుపాడు రోడ్డు వేయలేదన్నారు. చైర్మన్ రఫాని జోక్యం చేసుకొని పట్టణంలో కొన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు టెండర్లను పిలిచామని, మరికొన్ని వార్డుల్లో పిలవాల్సి ఉందని అన్నారు. టెండర్లను పిలవని వార్డుల్లో వెంటనే పిలవాలని, అజెండాలో పెట్టినట్లు పనులన్నీ త్వరగా పూర్తయ్యేలా చేయాలన్నారు. కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ రహీం సమాధానమిస్తూ అమృత పథకం కాంట్రాక్టర్లకు రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ పథకం కోసం కొన్ని చోట్ల రోడ్లు పగలగొట్టారని, వాటిని బాగు చేయించటమే కాకుండా పట్టణములోని పలు ప్రాంతాల్లో గుంతలను పూడ్చిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్టర్లు మరమ్మతులకు గురవడం వలన అద్దెకు తాగునీటి ట్రాక్టర్లను తీసుకుంటున్నట్టు తెలిపారు. కుక్కల బెడద నివారించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అజెండాలోని 37అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్మన్ రఫాని ప్రకటించి సమావేశం ముగించారు.

ఘనంగా చిన్నకంచెర్లలో చర్చి ప్రారంభం

చిన్నకంచెర్ల (శావల్యాపురం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంచెర్ల ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ 18ఏళ్ళ క్రితం కాలనీవాసులు చేపట్టిన చర్చి నిర్మాణంలో కొంత జాప్యం జరిగినప్పటికీ కాలనీవాసులంతా పట్టుదలతో విరాళాలు సేకరించి చర్చి నిర్మాణాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. చర్చి నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన కమిటీసభ్యులు ఎ.సాంబశివరావు, ఎస్.గాలెయ్య, యోహాను, ఎం.ప్రభాకర్, ఎం.ప్రభుదాసు, బి.బాబు, పి.ఏసుదాసు, పెదసత్యాలు, సత్యాలు, మాలప్రోలు హనుమంతరావు, మరియదాసులను జీవీ అభినందించారు.

రెండు రోటరీ క్లబ్బులకు పలు అవార్డులు

చిలకలూరిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేటల ద్వారా ప్రాంతంలో విశేష రీతిలో సేవా కార్యక్రమాలు చేసినందుకు గుర్తింపుగా పలు అవార్డులు, ప్రశంసా పత్రాలు లభించాయి. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో రెండు క్లబ్బుల వారు రోటరీ3150 జిల్లా చైర్మన్ కె.శరత్‌చౌదరి ద్వారా వీటిని అందుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురంనకు 8అవార్డులు, 10ప్రశంసా పత్రాలు, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేటకు 7అవార్డులు, 8 ప్రశంసా పత్రా లు లభించాయి. రెండు క్లబ్బులకు చెందిన వి.శరత్‌కుమార్, కె.సుబ్బారావు, ఎల్.రఘురా మిరెడ్డి, వి.ప్రసాద్, ఎ.రత్నప్రభాకర్, ఎం.వెంకటేశ్వర్లు, జి.సాంబశివరావు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి తల్లికి వందనం పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జప్రుల్లా

వినుకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని జడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయిలో తల్లికి వందనం కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో పలు మండలాల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పాటల పోటీలు, డ్రాయింగ్, కథలు చెప్పడం, నాటిక పోటీలు తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వ్యాసరచన విభాగంలో బి.సుధారాణి (అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉప్పలపాడు), వక్తృత్వ పోటీల్లో ఆర్.యజ్ఞశ్రీ (జడ్పీహెచ్ఎస్, బొగ్గరం), పాఠశాల పోటీలు వై.హేమలత (జడ్పీహెచ్ఎస్, వేల్పూరు), డ్రాయింగ్ ఎస్‌కే మస్తాన్‌బీ (జడ్పీహెచ్ఎస్, వినుకొండ), కథలు చెప్పడం విభాగంలో సీహెచ్.లక్ష్మయ్య (జడ్పీహెచ్ఎస్, ఇనిమెళ్ల), నాటక పోటీల్లో జడ్పీహెచ్ఎస్, వేల్పూరు పాఠశాల జట్టు విజేతలుగా నిలిచారు. వీరంతా త్వరలో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జప్రుల్లా, ఎం.పద్మజ, రాంబాబు, రాణి, శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి


మృతుడు తిరుపతిరావు

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంఘటన మండలంలోని వేల్పూరులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం వేల్పూరు గ్రామానికి చెందిన ఉయ్యాల తిరుపతిరావు(33) రెండు నెలల క్రితం వరకు శావల్యాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించేవాడు. తిరుపతిరావుకు మూడేళ్ళ క్రితం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన స్వాతితో వివాహమైంది. వివాహమైన తర్వాత ఏడాదిలోనే భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నెలరోజుల క్రితం పెదకాకాని పోలీసుస్టేషన్‌లో భార్యాభర్తలిద్దరికీ గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలని పెద్దమనుషుల సమక్షంలో పోలీసులు సర్దిచెప్పి పంపించారు. ఆదివారం వేల్పూరులో కొలుపులు ముగిసిన సందర్భంగా అన్నదానం జరుగుతుండడంతో తిరుపతిరావు తల్లి ఉయ్యాల సామ్రాజ్యం అక్కడ పనిచేసేందుకు వెళ్ళి అర్ధరాత్రి ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె ఇంటికి వచ్చేసరికి కుమారుడు తిరుపతిరావు ఇంటి ఆవరణలో మంచంపై ఉన్నాడు. అతని లేపేందుకు యత్నించగా స్పందించలేదు. చుట్టుపక్కల వారిని పిలిచి పరిశీలించగా తిరుపతిరావు మృతిచెంది ఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ లోకేశ్వరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి సామ్రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

ఎత్తిపోతల పథకంలో రాగి తీగల అపహరణ

కనమర్లపూడి (శావల్యాపురం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపంలోని తారకరామ ఎత్తిపోతల పథకం వద్ద ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలను, ఇతర సామగ్రిని అపహరించారు. సోమవారం ఉదయం అటువైపుగా పొలాలకు వెళ్ళే రైతులు గమనించి ఎత్తిపోతల పథకం కమిటీ అధ్యక్షుడు నర్రా నాగేశ్వరరావుకు సమాచారం అందించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలతో పాటు కొంత విలువైన సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. చోరీ ఘటనపై శావల్యాపురం పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావును అడగ్గా కమిటీ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిందని, వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యడ్లపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ సమీపంలోని పదహారో నంబరు కొత్త బైపాస్ మార్గం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బైపాస్ మార్గంలో వ్యక్తి మృతిచెందినట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు ద్వారా సమాచారం అందింది. సంఘటన స్థలాన్ని పరిశీలించగా మృతుడు మాసిన బట్టలతో కనిపించాడని, సరైన ఆహారం, నీరు లేకపోవడం వలన మృతిచెంది ఉంటాడని పేర్కొన్నారు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 50సంవత్సరాలు ఉంటాయని, ఈ ప్రాంతంలో యాచక వృత్తి చేసుకుంటూ సంచరిస్తుంటాడని విచారణలో తేలిందన్నారు. మృతిపై కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.


ఆర్టీసీ సర్వీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న లింగారావుపాలెం, ఉప్పరపాలెం గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం

● ఉప్పరపాలెం గ్రామస్థుల హర్షం

యడ్లపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెం నుంచి లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించింది. సోమవారం ఉప్పరపాలెంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు ఇరుగ్రామాల నాయకులతో కలసి సర్వీసును ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 8గంటలకు ఉప్పరపాలెం గ్రామంలో బయలుదేరి వంకాయలపాడు, యడ్లపాడు, మైదవోలు గ్రామాల మీదుగా లింగారావుపాలెం చేరుకుంటుందని, అలాగే తిరిగి సాయంత్రం 4.30 గంటలకు లింగారావుపాలెంలో బయలుదేరి ఉప్పరపాలెం చేరుకుంటుందని ఆర్టీసీ అధికారి ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి తొలిసారిగా ఆర్‌టీసీ బస్సు సర్వీస్ ప్రారంభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ సర్వీసు ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ఇరుగ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రామిరెడ్డి, గ్రామ పెద్దలు నంబూరు శివరామకృష్ణ, తోకల సత్యన్నారాయణ, ఎంపీటీసీలు తోకల వీరరాఘవయ్య, తోకల రాజేష్, మురుకుట్ల శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ జాన్‌వలి, గుంటుపల్లి రమణయ్య, ఆలోకం వీరనారాయణ, నంబూరు రమేష్, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, టి.విజయ శ్యామ్యూల్, ఉప్పరపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.



వినుకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డికి అవార్డులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వినుకొండకు 7 రోటరీ సేవా అవార్డులు

వినుకొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోటరీ జిల్లా 3150కి సంబంధించి 2024-25 సంవత్సరానికి రోటరీ సేవా అవార్డుల్లో వినుకొండ పట్టణానికి 7 అవార్డులు సాధించినట్లు అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హైందవ గౌరిక్ కన్వెన్షన్, కోంపల్లిలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డుల్లో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఒక గోల్డ్‌మెడల్, ఒక సిల్వర్ మెడల్, మూడు రజిత పతకాలతో పాటు మరో రెండు ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రాజెక్టు అవార్డులు, మరో విభాగాల్లో సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ సాధించామన్నారు. ఈ ఘనత సాధించడానికి కృషిచేసిన క్లబ్ సభ్యులకు, ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శ వై.వి.నారాయణ, కోశాధికారి మస్తాన్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


రథయాత్రలో పాల్గొన్న మహిళా భక్తులు

వైభవంగా జగన్నాథుని రథయాత్ర

నాదెండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో జగన్నాథుని రథయాత్రను వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో మహిళా భక్తుల కోలాటం, భజనల మధ్య ఈ రథోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు యాత్రలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుక్మిణీ సత్యభామ సమేత దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఐనవోలు శివనాగేశ్వరరావు, సభ్యులు ఐనవోలు రాధా, పూర్ణచంద్రరరావు, పసుమర్తి శివనాగేశ్వరరావు, జే మణిదీప్, మణికంఠ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునః నిర్మాణం కోసం రూ.2.5 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయం పునః నిర్మాణం కోసం దాతలు విరాళం అందజేశారు. సోమవారం నరసరావుపేట పట్టణానికి చెందిన దొడ్డ రఘురామారెడ్డి, శాంతకుమారి దంపతులు రూ.2,50,000 నగదును ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందచేశారు.

ఏపీవో రామారావు సేవలు అభినందనీయం: డ్వామా పీడీ

శావల్యాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి ప్రజలలో తప్పకుండా మంచి గుర్తింపు లభిస్తుందని, ఏపీవోగా రామారావు మండల ప్రజలకందించిన సేవలు అభినందనీయమని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవో రామారావు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. రామారావును దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఏపీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.